నేటి దినపత్రిక
సూర్య
శనివారం
27 మే 2023
పేజీలు 8
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# గ్రంథాలయ భవన నిర్మాణం వేగవంతం చేయండి

## జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఎం.హరినారాయణన్



నెల్లూరు, మేజర్‌న్యూస్: జిల్లా కేంద్ర గంధాలయ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. గురువారం ఉదయం నెల్లూరు రేబాల వారి వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. గ్రంథాలయం ఆవరణలో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. ఇప్పుడున్న గ్రంథాలయ భవనం చాలా పురాతనమైనది కావడం, వర్షాకాలంలో ఉరుస్తుండడంతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారని, నూతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు సహకరించాలని, జిల్లాలో పలుచోట్ల రోడ్డు విస్తరణలో గ్రంథాలయ భవనాలు తొలగిపోయాయని, వీటికి నష్టపరిహారం ఇప్పించాలని, అనేక చోట్ల ఖాళీగా ఉన్న పాఠశాల భవనాలను గ్రంథాలయ సంస్థకు ఇప్పిస్తే, అక్కడ గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని ఆమె కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేయించేలా చర్యలు చేపడతామని, రోడ్డు విస్తరణలో కోల్పోయిన గ్రంథాలయ భవన నిర్మాణాలకు నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పారు. భవన నిర్మాణ విషయమై నెల్లూరు నగరపాలకసంస్థ మున్సిపల్ కమిషనర్ తో కలెక్టర్ చర్చించారు. అనంతరం గ్రంథాలయంలో చిన్నారులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. కలెక్టర్ వెంట గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, ఏపీఈడబ్ల్యూఐడిసి ఈఈ హనుమంతరావు, డిఈ సుబ్బరాయులు, గ్రంథాలయ సంస్థ సిబ్బంది ఉన్నారు.



## కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలపై సజ్జలను కలిసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు, మేజర్‌న్యూస్: పభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలపై చర్చించారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్‌కు పని చేసిన నెలలకు వేతనాలు చెల్లించాలని కోరారు. దీనిపై రామకృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. అలానే సజ్జల రామకృష్ణా రెడ్డితో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ సమస్యల గురించి మాట్లాడారు.








## చిరు వ్యాపారులకు జనసేన గొడుగుల పంపిణీ

నెల్లూరు, మేజర్‌న్యూస్: నెల్లూరు నగరంలోని స్థానిక ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులు ఎండ వేడిమికి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న వ్యాపారస్తులకు జనసేన పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ బాబు ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని 54 డివిజన్లో చిరు వ్యాపారులకు తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, వెంకటేష్ , మనీ, వెంకటేశ్వర్లు సాయి , షారు, జన సైనికులు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు





## పులి కోటయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాలేపాటి

కావలి, మేజర్‌న్యూస్: కావలి పట్టణ మద్దురుపాడు 1వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు పులి కోటయ్య శుక్రవారం అకాల మరణం చెందారు. విషయాన్ని తెలుసుకున్న కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు వారి గృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలవేసి సంతాపం తెలియజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వీరితో పాటు కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, వార్డు నాయకులు కొమరా వెంకటేశ్వర్లు, పిలిమిట్ల సుబ్రహ్మణ్యం, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



కొడవలూరు, మేజర్‌న్యూస్: మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ 132వ జన్మదిన సందర్భంగా యువకులు కొడవలూరు సెంటర్లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బస్సులలో బైకులలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు యువకులు మజ్జిగను అందజేస్తున్నారు. ఎండ తాపాన్ని తట్టుకోలేక ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఈ మజ్జిగ అందించటంతో ఊరట కలుగుతుందని ప్రజలు సంతోషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దళితవాడకు చెందిన యువకులు పాల్గొన్నారు.

## నిర్వాసితకాలనీలో వివాహిత మహిళ ఆందోళన



ముత్తుకూరు, మేజర్‌న్యూస్: ఏపీ జెన్కో థర్మల్ కేంద్రం తరలింపు గ్రామమైన నక్కల మిట్ట కాలనీలో( ఆర్ అండ్ ఆర్ కాలనీ) తోటపల్లి గూడూరు మండలం వరకవిపూడి గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళ ఆందోళన చేపట్టింది. శుక్రవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. తనతో సంసార జీవితం గడిపి ఆడపిల్లకు తండ్రి అయ్యాడని తనకు తన భర్త కావాలంటూ ఆందోళనకు దిగింది. ఇంటి ముందు బైఠాయించడంతో గందరగోళ వాతావరణం నెలకొన్నది. కులాంతర వివాహం కావడంతో కుటుంబ సమస్యగా మారింది. దీంతో ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకోగా స్థానిక పోలీస్ శాఖ సంఘటన స్థలంకు చేరుకొని శాంతి భద్రతలను పరిరక్షించింది. స్థానిక ఎస్సై శివ కృష్ణారెడ్డి సంఘటన స్థలం వద్దకు చేరుకొని ఆందోళన చేసిన బాధిత వివాహిత మహిళతో మాట్లాడారు. రోడ్డుపైన ఆందోళన చేస్తే సమస్యకు పరిష్కారం కాదని చెప్పడం జరిగింది.ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్ కు పోలీసులు తీసుకెళ్లారు.

## కృష్ణపట్నంలో డ్రోన్ సర్వేకు సాంకేతిక సమస్యలు

ముత్తుకూరు మే 26 (మేజర్ న్యూస్) కృష్ణపట్నం గ్రామపంచాయతీలో శుక్రవారం భూమి కొలతల శాఖ చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం లో భాగంగా డ్రోన్ సర్వే ప్రక్రియకు సాంకేతిక లోపం ఏర్పడింది. సర్వే అధికారులు లక్ష్మీ తో పాటు గ్రామ సహాయక సర్వేయర్లు ఈ సర్వే కార్యక్రమానికి వచ్చి వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. డ్రోన్ పరికరంలో చిప్ పనిచేయకపోవడంతో సర్వేకు ఆటంకం కలిగింది. ఈ సందర్భంగా సర్వే డి టి లక్ష్మీ మాట్లాడారు. డ్రోన్ పరికరం నందు సమస్య వల్ల సర్వే చేయలేక పోయామని తదుపరి శనివారం సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం డిడిఓ రాజశేఖర్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పిఎస్ఆర్ ట్రస్ట్ దాతృత్వం



గూడూరు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేసి సత్కరించారు. శుక్రవారం ఉదయం గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిఎస్సార్ ట్రస్టు దాత్రుత్వంతో అభినందన సభ జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పది పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ చేతులమీదుగా విలువైన వాచీలు, మెమొంటోలు అందజేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతీ ఏడాది ప్రోత్సాహక బహుమతులను పిఎస్సార్ ట్రస్టుద్వారా అందజేస్తున్నామన్నారు. తద్వారా విద్యార్థుల్లో బాగా చదవాలనే ఆకాంక్ష పెరుగుతుందని తెలిపారు. ప్రవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ మౌలిక వసతులను సీఎం జగన్మోహన్ రెడ్డి సమకూర్చారని గుర్తు చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతికి చేరుకున్న తరువాత పదిమందికి చేయూత అందించాలని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి గూడూరు శాఖ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, సభ్యులు శ్రీనివాసులు, రవూఫ్, పురుషోత్తం, గోపాల్ యాదవ్, ముని, సాయి, రామ్మోహన్ రావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## కాలువల్లో పూడికతీతను పరిశీలించిన సర్పంచ్ అనురాధ

జలదంకి, మేజర్‌న్యూస్: జలదంకి పంచాయతీ పరిధిలోని పలు ప్రధాన వీధులలో డ్రైనేజీ కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తా చెదారం తో నిండి మురుగు నీరు నిల్వ ఉండడంతో కాలువలో పూడికతీత పనులు ప్రారంభించామని సర్పంచ్ చలంచర్ల అనురాధ తెలిపారు. శుక్రవారం మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ పంచాయతీ సెక్రెటరీ జి వెంకటేశ్వర్లు, శివాలయం కమిటీ చైర్మన్ వాక శ్రీనివాసులు రెడ్డి లతో కలిసి పలు ప్రాంతాల్లో మురికి నీరు నిండి ఉన్న కాలువలను పరిశీలించి గ్రామస్తులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెసిబిలా సహాయంతో కాలువలను పూర్తిగా తవ్వకాలు చేపట్టాలని వారు పడుతున్న సమస్య గురించి తెలియపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనురాధ మాట్లాడుతూ త్వరలో జెసిబి ల సహాయంతో ప్రధాన మురుగు కాలువలు శుభ్రం చేయించి అవసరమైన చోట తూములను ఏర్పాటు చేసి మురుగునీరు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రవహించేటట్లు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## మహానాడుకు తరలిన తెదేపా నాయకులు

దొరవారిసత్రం, మేజర్‌న్యూస్: దొరవారి సత్రం మండలం అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు అధ్వర్యంలో శుక్రవారం మహానాడుకి తరలిన తేదేపా నాయకులు, కార్యకర్తలు తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ ప్రపంచానికి చాటిచెప్పారని చంద్రబాబు ఈ సందర్భంగా కొనియాడారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు నాంది పలికారని కీర్తించారు. మహానాడు వేదికగా ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని చంద్రబాబు వెల్లడించారు. ప్రతి ఏటా ఎన్టీఆర్ జయంతి (మే 28) రోజు మహానాడు జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోందని తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమండ్రిలో 27, 28న జరగనున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు దొరవారిసత్రం మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం తరలి వెళ్లారుప్రధాన కార్యదర్శి పల్లంపర్తి మనోహరరెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు గోను జకరయ్య, కిషోర్ నాయుడు, మాజీ బీసీ సెల్ అధ్యక్షులు వంకారాధయ్య, బాబునాయుడు రవినాయుడు, ప్రసాద్నాయుడు, రవీంద్రనాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, యువరాజ్ నాయుడు, దార్ల మణి, వెంకటయ్య తదితరులు పలు వాహనాల్లో దొరవారిసత్రం నుంచి ఈ కార్యక్రమం విజయవంతం చేసుకొని రావాలని తేదేపా నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

## కొండెక్కిన అల్లం ధరలు



నెల్లూరు, మేజర్‌న్యూస్: గతంలో మునుపెన్నడూ లేని విధంగా రెండు రోజుల నుంచి కూరగాయల మార్కెట్లలో అల్లం ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు జంకు తున్నారు. గతంలో కిలో రూ.75 నుంచి వంద రూపాయలు లోపు ఉండగా, ప్రస్తుతం ఏకంగా కిలో రూ.300 పలుకుతుంది. వేసవి కాలం కావడం అల్లం వినియోగం ఎక్కువగా ఉండి డిమాండ్ పెరగడంతో ధర పెరిగిందని కూరగాయల దుకాణాల యాజమానులు చెప్తున్నారు.

## రాయితీ విత్తనాలు పంపిణీ

వరికుంటపాడు మేజర్ న్యూస్: మండలంలోని రైతులకు యాభై శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏవో కిరణ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అందులో భాగంగా కిలో జనుములు రూ. 42, జీలగలు రూ.39,50, వల్లిపెసరలు రూ. 48.50 చొప్పున పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్, సెల్ఫోన్ నెంబర్లతో వీఏఏలను సంప్రదించాలని కోరారు.

# పవన్ అన్న అన్నం బండికి 300 రోజులు: అభిమాని సిద్దు





కావలి, మేజర్‌న్యూస్: కావాలి పట్టణంలో జనసేన యువకుడు పవన్ కళ్యాణ్ అభిమాని పేదలకు పట్టెడు అన్నం పెట్టాలని సదుద్దేశంతో చైత్రయాత్ర ప్రారంభించి శుక్రవారంతో 300 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కావలి ఏరియా వైద్యశాలలో ముఖ్య అతిథిగా దళిత సంఘర్షణ సమితి మలి ఆధ్వ ర్యంలో కేకు కట్ చేసి పేదలకు పంచి పెట్టడం జరిగింది. అనంతరం సిద్దు మాట్లాడుతూ గతంలో నన్ను అధికార పార్టీ ఇక్కడ అవమానించి అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిందని, అయినప్పటికీ ఒక యువకుడిగా ఎక్కడైతే నాకు అవమానం జరిగిందో అక్కడే నేను ప్రజలకు అండగా నిలబడాలి. ఈ ప్రజలైతే ఆకలితో అలమటిస్తూ ఉన్నారు .వారికి ప్రతిరోజు నేను అన్నం పెట్టాలని ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని సాగిస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా కావలి చుట్టుపక్కల గ్రామాల ప్రాంతాల పేదలు ఏరియా వైద్యశాలకు వచ్చినప్పుడు అక్కడ ఆకలితో అలమటిస్తున్న పేదలని చూసినప్పుడు నాకు ఇటువంటి ఆలోచన వచ్చిందని ఈ ఆలోచనతోనే ప్రతి ఒక్క పేదవానికి నేను కొడుకుగా తమ్ముడిగా నేను తోడుగా ఉండి ప్రతి ఒక్కరి ఆకలి తీర్చేందుకు అన్నం బండి ఉందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు కూడా ఈ అన్నదాన కార్యక్రమానికి ఎక్కడ కూడా నేను చేయి చాప లేదని ఎక్కడ కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని మొదటి నుంచి గా నాకు మార్గదర్శకం దళిత సంఘర్షణ సమితి మలి నేనని నా మిత్రులేనని ,దీని అంతటికి కారణం భగవంతుని ఆశీస్సులు అని తెలిపారు. నా శక్తి ఉన్నంతవరకు ఈ పేదల ఆకలి తీర్చుటలో నేను తోడ్పడతానని తెలిపారు.



## అక్రమ తవ్వకాలను పరిశీలించిన భూగర్భ గనుల శాఖ అధికారులు

నెల్లూరు జిల్లా, మేజర్‌న్యూస్: దగదర్తి మండలం కేకే గుంట గ్రామం మంద అశోక్ ఫిర్యాదు మేరకు జిల్లా గనులు భూగర్భ శాఖ సాంకేతిక సిబ్బంది విజిలెన్స్ స్క్వాడ్ జగనన్నకు చెబుదాం ఫిర్యాదు మేరకు శాఖకు చెందిన ఆర్ ఐ కేకే గుంటలో తనిఖీ చేశారు. సర్వే నెంబర్ 334, 335 అకేట్ పొలాల్లో సున్నబట్టి గ్రామ పరిధిలో భూములలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదు మేరకు సదరు ప్రదేశం నందు తనిఖీ చేయగా అస్తవ్యస్తంగా పాత గుంతలు కలవు తనిఖీ సమయంలో ఎటువంటి వాహనంలో మిషన్ దొరకలేదని నివేదికలో తెలియజేశారు. సదరు ఫిర్యాదు విషయాన్ని డిప్యూటీ తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని మరియు డిప్యూటీ తాసిల్దార్ విఆర్ఏ లను సదరు ఫిర్యాదు ప్రాంతం నందు నిఘా ఉంచి అక్రమ తవ్వకాలు జరగకుండా చూస్తామని భవిష్యత్తు అక్రమ తవ్వకాలు జరిగితే సదరు వాహనాలు జప్తు చేసి గనులు భూగర్భ శాఖకు తెలియజేస్తామని వారు తెలియజేశారు. అక్రమ తవ్వకాలు జరిగితే గనులు భూగర్భ శాఖ, పోలీస్ శాఖ, రెవిన్యూ శాఖ సహాయతో తగు చర్యలు తీసుకోగలమని ఈ మేరకు ఆర్ఐ తెలియజేశారు.




## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: డిఎఫ్ఓ

ఉదయగిరి, మేజర్‌న్యూస్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత పర్యావరణ పరిరక్షణలో ప్రతి సభ్యుడు భాగస్వాములు కావాలని డీఎఫ్ఓ ఆవుల చంద్రశేఖర్ పేర్కొన్నారు శుక్రవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో పర్యావరణ వి ఎస్ ఎస్ చైర్మన్ వైస్ చైర్మన్లు సభ్యులు అటవీ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించకపోతే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు పర్యావరణ రహిత ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో 67 ప్లాంటేషన్లలో 990.73 హెక్టార్ల 716 విఎస్ఎస్ ల పరిధిలో 6695.83 హెక్టార్లలో జామాయిల్ సాగులో ఉందన్నారు ఇటీవల ప్రభుత్వం జామాయిల్ కటింగ్ ఆన్లైన్ లో టెండర్ ప్రక్రియ నిర్వహించగా 3460లకు వనం టింబర్ లైన్స్ టెండర్ను దక్కించుకుందన్నారు త్వరలో జిల్లా స్థాయిలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి జా మాయిల్ కటింగ్ కు తీసుకోవలసిన చర్యలపై చర్చిస్తామన్నారు. విఎస్ఎస్ ల పని తీరు బాగుండాలని అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పమన్నారు ప్రకృతికి జీవరాసులు వల్ల ముప్పు లేదని మానవాళి వల్లే ముప్పు వాటిల్లుతుందన్నారు ఈ కార్యక్రమంలో సబ్ డి ఎఫ్ ఓ రాజశేఖర్ బాబు రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వర్ రెడ్డి డి ఆర్ ఓ శ్రీనివాసులు ఎఫ్ ఎస్ ఓ వెంకటయ్య పార్ట్స్ డైరెక్టర్ టీవీ రమణయ్య ఎఫ్ బి ఓ లు ఏ బి ఓ లు వి ఎస్ ఎస్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు

# ఏపీసిఆర్‌పిఎఫ్ కమిటీ సమావేశం

నెల్లూరు జిల్లా, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు తిరిపాలు గారి ఆదేశాల మేరకు రాష్ట్ర రెండవ ఆఫీస్ అయిన పీ పీ కుంట దగ్గర నిన్న జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు తిరిపాలు గారు మాట్లాడుతూ మార్కెట్ వ్యవస్థలో జరుగుతున్న మోసాలు తదితర అంశాలపై త్వరలో నెల్లూరు జిల్లా ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తామన్నారు, ప్రణాళిక ప్రకారం అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు, అధికారులు మా ఫోరం సభ్యులకు సహకరించాలని కోరారు, వరికుంటపాడు మండలం భోగ్యంవారి పల్లి గ్రామంలో దారి విషయమై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని తెలిపారు, విక్రయదారులు లైసెన్సులను కలిగి ఉండాలని, నాణ్యత కలిగిన వస్తువులను మాత్రమే విక్రయించాలని, సూచించారు,



వినియోగదారులను మోసగించిన యెడల కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు, మండలాల పరిధిలో ఉన్న అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు, సౌత్ జోన్ ఇంచార్జి మల్లిఖార్జున మాట్లాడుతూ ఫోరం సభ్యులు నీతి నిజాయితీ గా పనిచేయాలని కోరారు, జిల్లా ఇంచార్జి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మార్కెట్ వ్యవస్థలో జరుగుతున్న మోసాలు,అధిక ధరలపై చాలా సార్లు పత్రికా ముఖంగా తెలియజేశామని చెప్పారు, ఫోరం సభ్యులు విధిగా అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించాలన్నారు, మోసం చేసిన విక్రయదారులపై ఆన్లైన్లో కేసులు నమోదు చేయించాలని సూచించారు, అగ్రికల్చర్ అడ్వయిజర్ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు తిరిపాలు గారు మరియు రాష్ట్ర కార్యదర్శి శేషయ్య గార్ల ఆధ్వర్యంలో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకట మోహన్ మాట్లాడుతూ కల్తీ లేని పాలు, ఆహార పదార్థాలను విక్రయించాలని కోరారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తిరిపాలు, సౌత్ జోన్ ఇంచార్జి మల్లిఖార్జున, నెల్లూరు జిల్లా ఇంఛార్జి ఉదయ్ కుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకట మోహన్, అగ్రికల్చర్ అడ్వయిజర్ సుధాకర్, దగదర్తి మండల అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అదాని ఫౌండేషన్ కృషి

**ఆదాని కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ**








ముత్తుకూరు, మేజర్‌న్యూస్: మండల కేంద్రం నిర్వాసిత కాలనీ ఆదాని చికిత్సాలయం 301 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అదాని కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ అన్నారు. శుక్రవారం ఉదయం ముత్తుకూరు ఆర్అండ్ఆర్ కాలనీలోని అదాని చికిత్సాలయంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అడ్మిన్ హెడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ శర్మ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల సహకారంతో అపోలో హాస్పిటల్ అదాని ఫౌండేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు .పోర్టు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అదాని కృష్ణపట్నం పోర్ట్ కృషి చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 301మందికి బిపి, షుగర్ ,జనరల్ హెల్త్ చెకప్ తో పాటు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు ప్రభుత్వ వైద్య అధికారిని డాక్టర్ ఎస్ అనూష, వెంకటాచలం ప్రభుత్వ వైద్యశాల కంటి వైద్య నిపుణులు డాక్టర్ బాల పద్మ, అపోలో హాస్పిటల్ డాక్టర్ గాయత్రి, అదాని ఫౌండేషన్ డాక్టర్ సుహార్సన్,అదాని ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్, రామానంద్ యాదవ్, రమేష్ బాబు, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా కుంకుమార్చన

ఉదయగిరి, మేజర్‌న్యూస్. మండల పరిధిలోని ఆర్లపడియ గ్రామంలో నూతనంగా శ్రీ కోదండ రామ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా గురువారం కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు విశేష సహస్ర నామ పూజలు హోమాలు, కుంకుమార్చనలను భక్తులచే అత్యంత వైభవంగా నిర్వహించారు.

# రంగనపల్లి వాటర్ ప్లాంట్‌కు మేకపాటి సొంత నిధులు



మర్రిపాడు, మేజర్‌న్యూస్: ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలిపిన ఓ సమస్యను తన స్వంత నిధులు వెచ్చించి పరిష్కారాన్ని చూపారు. వివరాల్లోకెళితే మర్రిపాడు మండలం సింగనపల్లి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో మంచినీటికి అవస్థలు పడుతున్నామని, వాటర్ ప్లాంట్ ను పునరుద్ధరణ చేస్తే తమకు మంచి నీటి సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి గ్రామస్తుల మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు శుక్రవారం బ్రహ్మణపల్లిలోని తమ నివాసంలో సింగనపల్లి గ్రామస్తులకు తమ స్వంత నిధులు రూ.50వేలు అందచేసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము సమస్యను తెలిపిన వెంటనే తమ స్వంత నిధులు రూ.50వేలు అందచేసి తమ మంచినీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డికి గ్రామస్థులు, వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పరీక్ష కేంద్రాల వద్ద ఆర్ఐఓ తనిఖీ



నెల్లూరు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: ఈరోజు అనగా శుక్రవారం, 72 పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించబడ్డవి, మొదటి, రెండవ సంవత్సరం గణితం-1A, 2A. బోటనీ-1,2, సివిక్స్ -1,2 పరీక్ష ఉదయం మొదటి సంవత్సరం సాయంత్రం రెండవ సంవత్సరం పరీక్షలు జరిగినవి. పరీక్షలు ప్రశాంతంగా జరిగినవి. ఉదయము జనరల్ విద్యార్థులు 10228 మందికి 9688 మంది హాజరు అయినారు, 540 మంది హాజరు కాలేదు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 303 మందికి 270 మంది హాజరు అయినారు, 33 మంది హాజరు కాలేదు. సాయంత్రం జనరల్ విద్యార్థులు 3124 మందికి 2848 మంది హాజరు అయినారు, 276 మంది హాజరు కాలేదు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 221 మందికి 191 మంది హాజరు అయినారు, 38 మంది హాజరు కాలేదు. జిల్లా కన్వీనర్ ఆర్ఐఓ వరప్రసాద్ , జిల్లా అబ్జర్వర్ మధుబాబు పరీక్షల కమిటీ సభ్యులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అధికారులు అందరు 54 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈరోజు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ పరిశీలకుడు రవిశంకర్ నాయక్ జిల్లలోని పరీక్షా కేంద్రాలను తనికీ చేశారు. ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎ సెంటర్ నందు ఒక్క విద్యార్థి దీబారు చేయటం జరిగింది.

## మండుతున్న ఎండలు.. హోరెత్తుతున్న గాలులు



మర్రిపాడు, మేజర్‌న్యూస్: మెట్ట ప్రాంతమైన మర్రిపాడు మండలంలో రోజురోజుకీ ఎండలు మండుతున్నాయి. దీనికి తోడు పడమటి గాళ్లు హోరెత్తిస్తున్నాయి. చిన్నారులు వృద్ధులు ఉససమణాన్ని కోల్పోతున్నారు. మండలంలో తేలికపాటి వర్షాలు ఈ మాసంలో నమోదైనప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చిన్నపాటి వర్షం నమోదు అయినప్పటికీ మరుసటి రోజు ఎండ తీవ్ర రూపం దాల్చుతోంది. మండలంలో ఎటువంటి జల వనులు లేకపోయినప్పటికీ అటవీ ప్రాంతం సమీపంలో ఉండడంతో ఎండ తీవ్రతకు తట్టుకోలేక పోతున్నారు. ఓపక్క ఎండ తీవ్రత మరో పక్క పడమటి గాలులు వీస్తుండడంతో మండల ప్రజలు చిన్నారులు వృద్ధులు బయటకు పరుగులు తీసి ఊపిరి పీల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ కోత కూడా ఉండడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లోని చెట్ల కింద మధ్యాహ్నం వేళలో శాలరీ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఏడాది వర్షపాతం తక్కువ అయినందున ఈ పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా మర్రిపాడు మండలంలో 40 డిగ్రీలు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆరు బయటకు వచ్చేందుకు ప్రజలు తల్లడిల్లి పోతున్నారు. దీంతో మండల కేంద్రమైన మర్రిపాడు సెంటర్ కూడా నిర్మానుషంగా మారి దర్శనమిస్తోంది.



## ఇంటింటికి తాగు నీరందించాలన్నదే జలజీవన్ లక్ష్యం: ఎంపిపి కేతా

ఆత్మకూరు, మేజర్‌న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరందించాలన్న లక్ష్యంగా జలజీవన్‌మిషన్ ఏర్పాటైందని ఆత్మకూరు మండలాధ్యక్షుడు, నెల్లూరు జిల్లా మండలాధ్యక్షులసంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడివో సి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జలజీవన్‌మిషన్ గురించి ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల అవగాహనా సదస్సులో వేణుగోపాల్‌రెడ్డి అతిధిగా పాల్గని ప్రసంగించారు. ప్రజలు దాహార్తితో ఇబ్బందిపడుకుండేలా జలజీవన్‌మిషన్ ద్వారా నిరందిస్తున్నామని కేతా పేర్కొన్నారు. ఈమిషన్ ద్వారా అందరూ తాగునీటిని పొందాలని ఆయన కోరారు. ఎండివో శ్రీనివాసులు మాట్లాడుతూ అందరికీ సురక్షితమైన తాగునీరందించాలన్నదే జలజీవన్ మిషన్ లక్ష్యమన్నారు. 15రోజులకొకదపా ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని, పైపులు లీకేజి లేకుండా చూసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. నీటిభధ్రత కోసం తగు చర్యలు తీసుకోవాలని, వ్యాపారసముదాయాలు, ఇళ్ళ నిర్మాణాలకు అనుమతులిచ్చే సమయంలో ఆప్రాంతంలో ఇంకుడుగుంటలు తప్పక ఏర్పాటుచేయాలని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏయి వి.నయోమి, జెజెఎం నిర్వాహకులు శర్మ, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు తదితరులు పాల్గన్నారు.

## మహానాడుకు తరలిరావాలి: తుమ్మల



ఆత్మకూరు, మేజర్‌న్యూస్: రాజమహేంద్ర వరం (రాజమండ్రి)లో ఈనెల 27, 28తేదీల్లో జరిగే తెలుగుదేశం మహానాడుకు ఆత్మకూరు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నందమూరి కుటుంబ అభిమానులు అధికంగా తరలిరావాలని స్థానిక మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్, పట్టణ టిడిపి అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం రాజమండ్రికి తరలివెళ్ళారు. ఆసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈదపా మహానాడు అత్యంత ప్రత్యేకంగా ఘనంగా జరుగనుందన్నారు. అదీగాక ఎన్నికలు రానున్న దృష్ట్యా పార్టీ మేనిఫెస్టో ముఖ్యాంశాల ప్రస్థావన, ప్రకటన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం కుటుంబసభ్యుల పర్వదినంగా భావించే మహానాడు వేడుకలు రాజయమండ్రిలోని వేమగిరి ప్రాంతంలో జరుగుతాయని, 27న ప్రతినిధుల సభలుంటాయని ఆయన పేర్కొన్నారు. 28వతేదీన లక్షలాదిమందితో వేడుకలు, బహిరంగ సభ జరుగుతుందని తుమ్మల వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, ఏఎస్‌పేట, సంగం, మర్రిపాడు మండలాలనుండి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు 28వతేదీ వేడుకలకు తప్పకుండా అధికంగా తరలిరావాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## వేసవిశిబిరంలో విద్యార్థులకు సృజనాత్మక కార్యక్రమాలు

ఆత్మకూరు, మేజర్‌న్యూస్: ఆత్మకూరు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవిశిబిరంలో విద్యార్థులకు సృజనాత్మక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నారు. శుక్రవారం ఈశిబిరంలో పాల్గన్న యల్లారెడ్డి విద్యార్థులకు కథలు విన్పించడంతో పాటు చదివించడం, చెప్పించడం చేశారు. చందమామ, పంచతంత్ర కథలను ఆయన చెప్పి విద్యార్థులను అనందింపజేశారు. అనంతరం విద్యార్థులచే కాగితాలతో క్రాఫ్ట్, డ్రాయింగ్ చేయించారు. లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అత్యంత ప్రయోజనం కలిగేలా ప్రతిఏటా లాగే ఈదపా కూడా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఈ శిబిరానికి విద్యార్థులను అధికంగా పంపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈకార్యక్రమంలో లైబ్రరి రికార్డ్ అసిస్టెంటు ఎల్.తనూజ, పాఠకులు, విద్యార్థినీ,విద్యార్థులు తదితరులు పాల్గన్నారు.



# ఉదయగిరి ఇన్‌ఛార్జి రేసులో 'మెట్టుకూరు'

ఆత్మకూరు, మేజర్‌న్యూస్: ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం లింగంగుంటకు చెందిన నెల్లూరు జిల్లా కేంద్రసహకారబ్యాంకు మాజీ చైర్మెన్, వైసిపి నేత మెట్టుకూరు ధనుంజయరెడ్డి గత కొంతకాలంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సమాయత్తమవుతున్న విషయం తెల్సిందే. తాజాగా ఉదయగిరి నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలతో అక్కడి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీనుండి సస్పెండ్ చేయడంతో అదే నియోజకవర్గంలో పార్టీ పరిశీలకులుగా నియమితులై పార్టీశ్రేణులతో తరచూ సమావేశాలు ఏర్పాటుచేస్తూ పార్టీకార్యక్రమాలను పరిశీలిస్తున్న ధనుంజయరెడ్డి ఆ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ పదవికోసం విశ్వప్రయత్నాల్లో ఉన్నారని, పలువురు జిల్లాలోని వైసిపి ప్రముఖుల అండకూడా ఉందని చెబుతున్నారు. ఉదయగిరి ఇన్‌చార్జ్ పదవికి మరికొందరు పోటీపడుతున్నా మెట్టుకూరుకు అవకాశాలు అధికంగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆయన రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా పోటీచేస్తానని, అయితే ఎక్కడనుండి అనేది స్పష్టం కాకున్నా ఉదయగిరి నియోజకవర్గంలో చోటుచేసుకున్న వైసిపి రాజకీయపరిణామాలతో అక్కడే ఇన్‌చార్జ్‌గా నియమింపజేసుకొని అదే నియోజకవర్గంలో పోటీ చేయనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల తరచూ ఆయన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలుస్తుండడం, ఉదయగిరి నియోజకవర్గ వైసిపి పరిశీలకులుగా నియమించడం, తాజా పరిణామాలతో అక్కడ కొత్త వైసిపి ఇన్‌చార్జ్‌ని నియమించాల్సి రావడంతో ఆయన ఆపదవికోసం గట్టి ప్రయత్నాలు ప్రారంభించారని ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లోనే పోటీచేయాలన్న ధనుంజయరెడ్డి వివిద కారణాలతో వీలుకాలేదు. ఈదపా మాత్రం తప్పకుండా అసెంబ్లీ బరిలో ఉంటానని చెప్పినట్లుగా ప్రచారంలో ఉంది. నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం లింగంగుంటకు చెందిన మెటుకూరు ధనుంజయరెడ్డి ఆనం రామనారాయణరెడ్డికి ముఖ్య అనుచరుడుకాగా జిల్లా కేంద్రసహకారబ్యాంకు చైర్మెన్‌గా ఎన్నికై కొనసాగి బ్యాంకును లాభాలబాటలో నింపడంతోపాటు రైతులకు ఋణాల సదుపాయాలను భారీగా పెంచి అశేష ఆదరణ పొందారు. తగిన అనుచరగణం,పరిచయాలు కలిగిన ఉదయగిరి నియోజకవర్గంలో ఇటీవల వైసిపి



పరిశీలకులుగా నియమితులయ్యాక ఆపార్టీ నేతలు,కార్యకర్తలతో మమేకమవుతూ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ అక్కడ పార్టీ విజయం లక్ష్యంగా అన్నచందంగా ప్రత్యేక శ్రద్ధతో కృషిచేస్తున్నారు. అసెంబ్లీకి పోటీచేయాలన్న ఆసక్తి, తలంపు కలిగిన మెట్టుకూరు ఈదపా మాత్రం పోటీకి సమాయత్తమవుతుండగా తలవనితలంపుగా ఉదయగిరి నియోజకవర్గానికి పార్టీ పరిశీలకులుగా నియమితులవడం, ఇదే తరుణంలో అక్కడ వైసిపి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీనుండి సస్పెండ్ కావడం ధనుంజయరెడ్డికి కలిసివచ్చిన అదృష్టంగా అందరూ భావిస్తున్నారు. అదీగాక ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో ఆయనకు సాన్నిహిత్యం పెరిగిందని, వైసిపి ఇన్‌చార్జ్‌రేసులో మెటుకూరుకే ప్రాధాన్యత లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయని, అదేజరిగితే రానున్న ఎన్నికల్లో ఆయన అక్కడనుండే వైసిపి అభ్యర్థిగా పోటీచేయగలరని సర్వత్రా ప్రచారం సాగుతోంది. మరి ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో త్వరలోనే స్పష్టంకానుందంటున్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో సోమశిల ప్రాజెక్టుకు భద్రత కరవు

### మరో అన్నమయ్య ప్రాజెక్టును చేస్తారా: జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి

ఆత్మకూరు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ నిర్లక్ష్యంతో అత్యంత ప్రాధాన్యత కలిగిన సోమశిల జలాశయానికి భధ్రత కరువైందని ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ తీవ్రంగా విమర్శించారు. ఆయన నియోజకవర్గంలోని అనంతసాగరం మండలంలో ఉన్న సోమశిల జలాశయాన్ని తమ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 2020, 2021 సంవత్సరాల్లో సంభవించిన వరదలు, భారీవర్షాల కారణంగా జలాశయం ముందుభాగంగా తీవ్రంగా దెబ్బతిన్నదని, దాదాపు 40అడుగుల గోతులు పడ్డాయని ఆయన పేర్కొన్నారు. డ్యామ్‌సేఫ్టీరివ్యూకమిటీ ప్రతినిధులు కూడా ఈ గుంటలను పరిశీలించారన్నారు. ఈ గుంటలు ప్రాజెక్టు భధ్రతకు ఎంతో ప్రమాదకరమని వారు పేర్కొంటూ 2020లోనే నివేదిక ఇచ్చినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రెండేళ్ళ అనంతరం 110కోట్ల రూపాయలు నిధులు మంజూరుచేశామంటూ ప్రకటనచేశారని శ్రీధర్ పేర్కొన్నారు. అయితే సక్రమంగా పనులు జరగ డంలేదని, గత రెండేళ్ళుగా సోమశిల జలాశయ భధ్రతను, పెన్నానదీపరీ వాహక ప్రాంత ప్రజల ప్రాణాలను గాలికొదిలి నిమ్మకునీరెత్తినట్లుగా చోధ్యం చూస్తుండడం , ప్రజల ఆందోళనకర పరిస్థితిని కూడా పట్టిం చుకొనకపోవడం పభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈనిర్లక్ష్యమే గత ఏడాది కడపజిల్లాలో ప్రజలపాలిట ఆధునిక దేవాలయం అయిన అన్నమయ్యప్రాజెక్టు కొట్టుకొని పోవడమేకాకుండా అపార ప్రాణ, ఆస్థినష్టం సంభవించిందని శ్రీధర్ పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సోమశిల జలాశయం భధ్రతపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పెన్న పరీవాహక గ్రామాల



ప్రజలకు దినదినగండంనూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా మారిందని, సోమశిల ప్రాజెక్టును కూడా మరో అన్నమయ్య ప్రాజెక్టును చేస్తారా అని ఆయన ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలంగడుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. సోమశిల ప్రాజెక్టు వద్ద మరమ్మతులకు 110 కోట్లు మంజూరు చేశామని ప్రభుత్వం ప్రకటించి తూతూమంత్రంగా పనులు ప్రారంభించినా సక్రమంగా జరగడంలేదని, గత రెండేళ్ళ వరదల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని శ్రద్ధ వహించి యుద్ధప్రాతిపదికన సోమశిల జలాశయం వద్ద మరమ్మతులు చేయాలని శ్రీధర్ డిమాండ్ చేశారు.

# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

### గ్రీవెన్స్ డే నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.కె. తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో పని చేయుచున్న పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ కె తిరుమలేశ్వర్ రెడ్డి తెలిపారు .ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సంక్షేమ దివస్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. అనారోగ్యం, బదిలీలు, సర్వీసుకు సంబంధించిన సమస్యల అర్జీలను సిబ్బంది నుండి స్వయంగా స్వీకరించి, నిశితంగా పరిశీలించి, యోగక్షేమాలు తెలుసుకొని సాధ్యమైనంత వరకు సహాయం చేస్తానని యస్.పి. తెలిపారు. అనారోగ్యం, తల్లిదండ్రులు, చిన్న పిల్లల సంరక్షణ, దూరప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



అవసరాలను గుర్తించి బదిలీల విషయంలో తప్పక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని, అనవసరంగా, అనుమతి లేకుండా గైర్హాజరు కావద్దని, తద్వారా క్రమశిక్షణ చర్యలకు గురికావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను పరిశీలించి మహిళా పోలీసుల బదిలీల విషయంలో తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది సంక్షేమానికి కేటాయించిన పోలీస్ వెల్ఫేర్ డే ను సిబ్బంది వారి వారి అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. డిజర్టర్ నుండి విధులకు, సాదారణ బదిలీలు, అనారోగ్య సమస్యలు, సర్వీసు సంబంధిత సమస్యల అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిట్రగుంట రైల్వేస్టేషన్ వద్ద మాక్‌డ్రిల్

బిట్రగుంట, మేజర్‌న్యూస్: విజయవాడ డివిజన్ రైల్వే పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్ సిఎన్‌డబ్ల్యూ కార్యాలయం వద్ద శుక్రవారం ఎన్ డి ఆర్ ఎఫ్ పదవ వార్షికోత్సవ మాస్టర్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్ డి ఆర్ ఎఫ్ అధికారి రాబిన్‌కుమార్, సుధీర్ కుమార్, విజయవాడ అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు. రైల్వే ట్రైన్లలో జరిగే ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఎన్డిఆర్ఎఫ్ బృందాలు విన్యాసాలు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డిఎస్ఓ జె శ్రీకాంత్, పివి రమణ రాయి ,ఎం రవి కిరణ్ ,మనోజ్ కుమార్, బిట్రగుంట స్టేషన్ సూపర్డెంట్, బిట్రగుంట రైల్వే అన్ని విభాగాల సిబ్బంది రైల్వే అధికారులు ఉన్నారు.



## పదోతరగతి మెరిట్ యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కావలి, మేజర్‌న్యూస్: కావలి పట్టణంలోని, నియోజకవర్గ ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులకు 10వ తరగతి పాస్ అయిన యాదవ కులానికి చెందిన విద్యార్థిని విద్యార్థులకు మెరిట్ పురస్కరించుకొని ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు వై ఈ పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి బూచి మసూదన్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలి మరియు కందుకూరు లో 2023 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో 500 మార్కుల పైగా సాధించిన యాదవ విద్యార్థిని విద్యార్థులకు జూన్ రెండో తేదీన అనగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు నెల్లూరు ఎంసీఏ కళ్యాణ మండపం విజయమహల్ గేటు దగ్గర నెల్లూరు నందు యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వారిచే పురస్కారోత్సవ కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమంలో యాదవ పెద్దలు రాజ్యసభ సభ్యులు శ్రీద మస్తాన్ రావు మాజీ మంత్రివర్యులు అనిల్ కుమార్ యాదవ్ బీద రవిచంద్ర మరియు ఇతర ప్రముఖ యాదవ పెద్దల చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుంది తెలిపారు. విద్యార్థులు వివరముల కొరకు ఈ నంబర్లకు 9441044231, 8309416759. ఫోన్ చేయవలెను.

## కోట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పీ



కోట, మేజర్‌న్యూస్: సాధారణ తనిఖీలో భాగంగా కోట పట్టణంలోని పోలీస్ స్టేషన్ ను శుక్రవారము గూడూరు డిఎస్పీ సూర్య నారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మీడియాతో మాట్లాడుతూ కోట పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక ఎస్సీ ఎస్టీ కేసులు పెండింగ్లో ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని యువత ప్రమాదాల్లో దెబ్బతినడం దేశ ప్రగతికి మంచిది కాదని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను మరియు రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించే విధంగా పటిష్ట చర్య తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకాడు సిఐ హరికృష్ణ, కోట ఎస్సై పుల్లారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో గడ్డివాముల దగ్ధం



బోగోలు, మేజర్‌న్యూస్ : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెం లో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 2 గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. రామస్వామి పాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు రత్తయ్య పశువుల మేత నిమిత్తం గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నాడు. మధ్యాహ్నం గడ్డివాములు తగలబడుతుండటంతో స్థానికులు రైతుకు సమాచారం అందించారు. స్థానికులు గడ్డివాములను ఆర్పేందుకు ప్రయత్నాలు చేశారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో పక్కనే ఉన్న ఇతర గడ్డివాములకు మంటలు వ్యాప్తి చెందకుండా నియంత్రించారు.

## ఘనంగా వెంకటస్వామిరెడ్డి జయంతి వేడుకలు



కోవూరు, మేజర్‌న్యూస్: తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి తండ్రి చేజర్ల వెంకటస్వామి రెడ్డి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో తనయుడు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆయన అభిమానులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయటమే లక్ష్యం



బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా కోవూరు నియోజకవర్గంలో చేపట్టిన'' గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిం చడం జరుగుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని ఏడవ వార్డు ఎనిమిదో వార్డులో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో తన కుమారుడు రంజిత్ కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకొని వాళ్ళ సమస్యలపై ఆరా తీశారు. అలాగే అవార్డులో చేసిన అభివృద్ధి పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ మోర్ల సుప్రజ ఏడవ వార్డు కౌన్సిలర్ షేక్ షకీలా బేగం 8వ వార్డు కౌన్సిలర్‌లు నాయకులు కార్యకర్తలు అధికారులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులను తనిఖీ చేసిన జడ్పీ సీఈవో



కోట, మేజర్‌న్యూస్: కోట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం జడ్పీ సీఈఓ చిరంజీవి ఆకస్మిక పరిశీలు నిర్వహించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయ పనితీరును పరిశీలించేందుకు తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యాలయంలో రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కోటలోని గ్రామ సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జగనన్న సైనికులు వాలంటీర్లు: పోలంరెడ్డి



పెళ్ళకూరు, మేజర్ న్యూస్ : సంక్షేమ పథకాలకి పునాదులు జగన్ అన్న కు సైనికులు వాలంటీర్స్ అని మండల పరిషత్ అధ్యక్షులు పోలంరెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన వాలంటీర్స్ వందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఆయనతో పాటు నగిరి నియోజకవర్గ పరశీలకులు చిందేపల్లి మధుసూదన్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ మారాబత్తిన సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెలబల్లి కలవకూరు పుల్లూరు సచివాలయంలోని వాలంటీర్స్‌లకు సేవా మిత్ర అందుకుంటున్న వారికి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియచేసారు. ఈ సందర్బంగా ఎం.పి.పి మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా ప్రజలకు చేరవేసే విధంగా 50 ఇళ్లకు ఒక వాలంటీర్స్ ను ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి మధుమోహన్ దాస్ నాయకులు సాగి జితేంద్ర, మట్టిపాటి చెంగయ్య, కుదిరి చక్రపాణి,అట్ల కృష్ణయ్య, అట్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రైడే- డ్రైడేతో దోమల ఉత్పత్తికి కట్టడి



దొరవారి సత్రం, మేజర్‌న్యూస్ : దోమల ఉత్పత్తి లార్వాలను అరికట్టడం, పలు రకాల జ్వరాలను ప్రజల నుండి దూరం చేయడం వంటి కార్యక్రమానికై రాష్ట్ర ప్రభుత్వం ఫ్రైడే- డ్రై డే అనే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం ఆరోగ్య ఆరోగ్యశాఖ అమలు చేస్తోంది. ఈ క్రమంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది శుక్రవారంఈ కార్యక్రమాన్ని అమలు చేశారు.ప్రతి గ్రామంలో 50 గృహాలకు పైబడి సర్వే చేపట్టి వారి పరిసరాల్లో ఉన్న వస్తు సామాగ్రిలో, నీటి నిల్వలు పాత్రలు, తొట్టెలు, సంపులను పరిశీలించి దోమల లార్వాలను పూర్తిస్థాయి నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ప్రజలకు ఈ కార్యక్రమం ప్రాధాన్యతను గురించి అవగాహన కల్పించారు. మన గృహం, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని, ప్రతి శుక్రవారం నీటి నిల్వలు చేసే పాత్రలను ఎండగట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణ సంబంధిత సూపర్వైజర్లు పరిశీలిస్తున్నారు. నీటి నిల్వలు ఉన్న పాత్రల్లో తోక పురుగులు లాంటివి కనిపిస్తే వెంటనే ఆ నీటిని భూమిపై పారవేయాలని సూచించారు. ఈ రోజు జరిగిన సర్వే కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.

## మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగిస్తాం



గూడూరు రూరల్, మేజర్‌న్యూస్: గత పది రోజులుగా గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ నందు గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ప్రస్తుత ఎండలో తీవ్రత. దృష్ట్యా ఈ చలివేంద్రాన్ని ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టేంత కొనసాగిస్తామని తెలిపారు. మజ్జిగ చలివేంద్రానికి దాతగా రొటేరియన్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. గూడూరు పట్టణ ప్రజలు కూడా ప్రస్తుత ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటం చేత, సకాలంలో త్వరితగతిన అత్యవసర పనులు ఉంటేపూర్తిచేసుకొని, వీలైనంత వరకు ఎండల నుంచి తప్పించుకొని జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాసు గౌడ్, సిద్ధారెడ్డి, రాజేంద్రరెడ్డి, బలరాం రెడ్డి, సేగు శ్రీను, మౌర్యతేజ పాల్గొన్నారు.

## 2 వేల నోటుతో ఇబ్బందుల్లో ప్రజలు

వింజమూరు, మేజర్‌న్యూస్: రిజర్వ్ బ్యాంకు ఇటీవల 2000 నోట్ల రద్దు విషయాన్ని ప్రకటించి సెప్టెంబర్ నెల వరకు వాటిని మార్చుకోవచ్చని గడువు ఇచ్చిందని ఆ గడువు లోపల మార్చుకోవచ్చని ప్రజలు ఉండగా ప్రస్తుతం అవసరాలకు వినియోగించుకోవాలని ప్రజలు 2000 రూపాయల నోటును ఉపయోగించేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా నిరాకరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వింజమూరులో విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులు వెళ్ళగా 2000 రూపాయల నోటును తీసుకోమంటూ నిరాకరించడంతో వినియోగదారులు బెంబేలు ఎత్తుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన గడువు సెప్టెంబర్ దాకా ఉంది కదా ఎందుకు తీసుకోరు అని ప్రశ్నించగా పై అధికారుల సూచనలు మేరకు మేము ఏమీ చేయలేమని కిందిస్థాయి సిబ్బంది చెప్పడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో వినియోగదారులు ఉన్నారు. ఈ విషయంపై ఏ ఈ ఓ కావలి వారిని అడగగా 2,000 నోటును బ్యాంకుకు వెళ్లి మార్చుకొని రావాలని అప్పుడే బిల్లు చెల్లించవచ్చని తెలియజేస్తున్నారు. కిందిస్థాయి సిబ్బంది రోజుకు పది నోట్లు మాత్రమే తీసుకుంటామని ఆ పైన తీసుకోవడానికి కుదరదని కరాకండిగా చెప్పడంతో ఏమీ చేయలేని స్థితిలో వినియోగదారులు ఉన్నారు.

## తెగిపడిన విద్యుత్ తీగ తగిలి గేదె మృతి



ముత్తుకూరు, మేజర్‌న్యూస్: పంటపాలెం గ్రామపంచాయతీలో శుక్రవారం సాయంత్రం సుమారు 70 వేల రూపాయలు విలువచేసే బర్రె విద్యుత్ షాక్ కు గురై మృతి చెందింది. తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు బర్రె కాళ్లకు చుట్టుకుని ఈ ప్రమాదం చోటు చేసుకోగా కరెంటు షాక్ తో అక్కడికక్కడే గేదె చనిపోయింది. చనిపోయిన గేదె యజమాని పాముల మస్తానమ్మ ఈ బర్రెను మేపుకుంటూ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం సమయంలో వీచిన విపరీతమైన ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడిపోవడంతో ఈ ప్రమాదానికి కారణం అయింది. ప్రభుత్వపరంగా విద్యుత్ శాఖ అధికారులు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని గేదె యజమానురాలు వేడుకుంది. స్థానిక పంచాయతీ పాలకవర్గం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు చేరుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వపరంగా సాయం వచ్చే విధంగా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.

# పర్యావరణ పరిరక్షణ చర్యలను బాధ్యతగా పాటించాలి: కమిషనర్ వికాస్‌మర్మత్

కార్పొరేషన్, మేజర్‌న్యూస్: సమస్త జీవవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించుకుని, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని నగరపాలకసంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రామ, వార్డు సచివాలయ విభాగాల సంయుక్తాధ్వర్యంలో "పర్యావరణహిత జీవనశైలి"పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీని శుక్రవారం ఉదయం నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ కూడలి నుంచి సైకిల్ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. తదుపరి సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ ఏ.సీ సుబ్బారెడ్డి క్రీడా మైదానం వరకు సైక్లింగ్ చేసిన అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మనందరి దైనందిన అలవాట్లలో చిన్న చిన్న మార్పులతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణ, జౌళి సంచుల వాడకం, విద్యుత్ ఆదా, సోలార్ వస్తువుల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కాలుష్య ఉద్గారాల నియంత్రణ, తక్కువ దూరాలకు సైక్లింగ్, సాధ్యమయినంత వరకు ప్రజా రవాణా వాడటం, ఎలివేటర్ బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో మార్పుకోసం ప్రయత్నించాలని కమిషనర్ కోరారు. భవిష్యత్తులో



పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన ర్యాలీలు, నడక పోటీలు, మారథాన్ వంటి వినూత్న కార్యక్రమా లను క్రమంతప్పకుండా అమలు చేయనున్నామని కమిషనర్ తెలిపారు. వివిధ రకాల ప్రోత్సాహక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం పెంచి, కాలుష్యరహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని కమిషనర్ వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో నెల్లూరు నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు మరియు సిబ్బంది, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, స్త్రీ స్వశక్తి సంఘాల సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, గ్రామ,వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ ఎంవిఆర్



ఆత్మకూరు, మేజర్‌న్యూస్: గుండెవ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి హాస్పిటల్ వైద్యులు, జెవివి నాయకులు డాక్టర్ ఎం.వి.రమణయ్య సూచించారు. శుక్రవారం ఆత్మకూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుండెవ్యాధుల అవగాహనా సదస్సులో ఆయన పాల్గని ప్రసంగించారు. గుండెవ్యాధులు, లక్షణాలు, అవసరమైన వైద్యపరిక్షలు, చికిత్సలు తదితరాలను గురించి ఆయన అవగాహన కల్పించారు. మానవశరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం గుండె అని, వ్యాధులు సోకకుండేలా ఆహారనియమాలు కూడా పాటించాలని, మద్యం, పొగాకు, సిగరెట్ తదితరాలను అలవాటు చేసుకోరాదని, అలవాటు ఉన్నవారు వెంటనే మానుకోవాలని కూడా ఆయన సూచించారు. గుండెవ్యాధుల లక్షణాలు ఏమాత్రం కన్పించినా, సందేహం కలిగినా వెంటనే వైద్యులను సంప్రతించి అవసరమైన వైద్యపరిక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్సలు చేయించుకోవాలని డాక్టర్ రమణయ్య కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, రైతుసంఘ జిల్లా నాయకుడు జి.లక్ష్మిపతి, పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గన్నారు.

## నేడు రిలే నిరాహార దీక్షను ఉద్యోగులు విజయవంతం చేయాలి

వింజమూరు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు పరిష్కారంలో భాగంగా నేడు వింజమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను ఉద్యోగులు విజయవంతం చేయాలని ఏపీజీఈఏ వింజమూరు తాలూకా అధ్యక్షులు, చాకలికొండ గ్రామ పంచాయితీ కార్యదర్శి బంకా శ్రీనివాసులురెడ్డి ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్లు,కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ కనీసం నెలనెలా వచ్చే జీతాల విషయంలో కూడా జాప్యం చేస్తూ ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్,ఏపీజిఎల్ఐ వంటి నిధులను సక్రమంగా వాడుకోనివ్వకుండా సరెండర్ లీవ్ వంటి అనేక ఉద్యోగ రాయితీలను మంజూరు చేయకుండా ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సముచితం కాదని శ్రీనివాసులురెడ్డి హితువు పలికారు. .కనుక ఏపీజీఈఏ తలపెట్టిన దీక్షలలో ఉద్యోగులు అందరూ పాల్గొని పతాక స్థాయిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళవలసిన సమయం ఆసన్నమైందని శ్రీనివాసులురెడ్డి కోరారు.



## సచివాలయాలను తనిఖీ చేసిన కమిషనర్

కార్పొరేషన్, మేజర్ న్యూస్: నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 18/1, 18/2 హరనాథపురం, పీపుల్స్ పార్క్ సమీపంలోని వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్స్ట్రక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని తెలిపారు. దేవాలయం ఎదురుగా ఉన్న ఆ ప్రాంతం దేవాదాయశాఖ పరిధిలో ఉన్నందున తగిన చర్యలు తీసుకునేలా ఆ శాఖకు సమాచారం అందించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ శేషగిరిరావు, ఏ.ఈ ఫాజిల్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## బ్యాంక్ మేనేజర్‌కు ఘన సన్మానం

తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్, మండలంలోని కోడూరు కెనరా బ్యాంకు మేనేజర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి బదిలీ అయిన సందర్భంగా బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు పొదుపు గ్రూపు మహిళలు శుక్రవారం ఘనంగా సన్మానించారు ఆయన మూడు సంవత్సరాల మేనేజర్ బాధ్యతలో చేసిన సేవలను కొనియాడారు. నూతనంగా ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన మేనేజర్ రవిచంద్రను స్వాగతించారు బ్యాంక్ సహాయ మేనేజర్ భరత్ తన సందేశంలో రాజేంద్రప్రసాద్ రెడ్డి సిబ్బందితో ఖాతాదారులతో స్నేహ సంబంధాలు కలిగి అభిమానం పొందడాన్ని కొనియాడారు బదిలీ అయిన రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ని సిబ్బంది ఖాతాదారులు పొదుపు మహిళలు సన్మానించారు తనకు జరిగిన సన్మానం మరువలేనిదని విధి నిర్వహణలో తన వల్ల ఎవరికైనా అసౌకర్యం కలిగి ఉంటే మన్నించాలని కోరారు నూతన బాధ్యతలు చేపట్టిన మేనేజర్ రవిచంద్రకు అన్ని విధాల సహకరించాలని కోరారు ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ వి మాధవరావు బదిలీ అయిన బ్యాంకు మేనేజర్ సేవలపై ఆలపించిన కవిత గేయం సభికులను ఆకట్టుకుంది



# వీర్లగుడిపాడును ఆత్మకూరు మండలానికి మార్చాలన్నది కంఠశోషేనా

ఆత్మకూరు, మేజర్‌న్యూస్: వరదలు సంభవించినా, భారీవర్షాలు కురిసినా, సోమశిల జలాశయం నుండి అధికనీటిని పెన్నానదికి విడుదల చేసినా ఆందోళనకు గురయ్యే గ్రామం, అందరికీ గుర్తుకు వచ్చే గ్రామం ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం వీర్లగుడిపాడు. ఈగ్రామం సమీపంలోని ఆత్మకూరు మండలంలోకి మార్చాలన్న ఆగ్రామస్థుల కోరిక కంఠశోషగానే మిగిలింది. కేవలం ఐదారువందల జనాభా, 400 మందో ఓటర్లు కలిగిన చిన్నగ్రామమై అయినా ఇరువైపులా పెన్నా, బగ్గేరు నదులు ఉండడంతో పుష్కలంగా సాగునీటి వసతి కలిగి పైర్లతో పచ్చదనం కళకళలాడుతూ కన్పిస్తుంటుంది. గతంలో వరి, కొబ్బరి, సపోటా, తమలపాకులు తదితర పంటలు అధికంగా ఉండేవి. కొంతకాలం క్రితం రొయ్యలు, చేపల గుంటలు కూడా అధికంగా తీసి కొనసాగించారు. క్రమీణా వాటిని కూడా తొలగించి వరిపైరు సాగుచేస్తున్నారు. తమలపాకు తోటలు పూర్తిగా లేకుండా పోయాయి. కొబ్బరిచెట్లు మాత్రం అధికంగా ఉన్నాయి. కాగా ఈగ్రామానికి సంబంధించి పలు సమస్యలు అనాదిగా ఉన్నా నాయకులు హామీలివ్వడమే తప్ప వాటిని గురించి పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు. వీర్లగుడిపాడు ఆత్మకూరుకు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండగా మధ్యలో బగ్గేరు ఉంది. రాకపోకలు సాగించే అవకాశం లేదు. అదీగాక ఈ గ్రామం సంగం మండలంలో ఉంది. ఏ పనిబడినా మండల కేంద్రానికి వెళ్ళాలంటే ఆత్మకూరు మీదుగా 33 కిలోమీటర్లు



వరదల సమయంలో పడవలో పయనిస్తున్న దివంగత మంత్రి గౌతంరెడ్డి (ఫైల్‌ఫోటో)

ప్రయాణించాల్సి ఉంది. ఆత్మకూరు మండలంలో తమ గ్రామాన్ని చేర్చాలని, బగ్గేరుపై వంతెన నిర్మిస్తే కేవలం ఐదు కిలోమీటర్లలో ఆత్మకూరు ఉన్నందున , తమ అవసరాలన్నింటికి ఆత్మకూరే అయినందున ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని గ్రామస్థులు అనాదిగా చెబుతుండగా ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు అలకించడం, అనంతరం మరిచిపోవడం సాగుతోంది.పెన్నా, బగ్గేరు నదుల మధ్య ఈ గ్రామం ఉండడంతో భారీ వర్షాలు కురిసినా, పైతట్టు ప్రాంతాల్లో వర్షాలు అధికమై సోమశిల జలాశయానికి నిండుగా చేరాక నీటిని పెన్నానదికి లక్షలాది క్యూసెక్కులు విడుదల చేస్తే నదీ పరీవాహకంలో లోతట్టుగా ఉన్న వీర్లగుడిపాడు జలదిగ్గంధంకు గురికావడం, గ్రామంలోకి ఐదారు అడుగుల నీరు ప్రవేశించడం జరుగుతుంది. గ్రామంలో ఒకే ఒక కమ్యునిటిహాల్ ఉండగా అందరూ అక్కడే తలదాచుకొని కాలంగడుపుతుంటారు. అధికారులు ఈవలవైపు చేరి ఆహారపదార్థాలు పడవలద్వారా చేరవేస్తుంటారు. అయితే ఇంతటి ఆందోళనకరమైన పరిస్థితిలో ఈ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలంటే సారవంతమైన నేలలు, పుష్కలమైన సాగునీరు, ఏడాదిపొడవునా పంటలు అంటూ గ్రామస్థులు తిరస్కరిస్తుంటారు. చిన్ని గ్రామమైనా పాడిపంటలతో గ్రామస్థులకు లాభసాటిమాత్రమే కాకుండా రవాణాదారులకు, వాహనాలకు, విద్యుత్ చార్జీలు రూపేణా అధికంగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కూలీలకు నిత్యం ఉపాధి ఉంటుంది. అలాంటి గ్రామం పలు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించి ఆత్మకూరు మండలంలో చేర్చడం, బగ్గేరుపై వంతెన నిర్మించడం, వరదల దృష్ట్యా ఒక పక్కా పునరావాసకేంద్రం నిర్మించడం తదితర చర్యలు తీసుకోవడం లేదని అందరూ వాపోతున్నారు. గత వరదల సమయంలో అప్పటి రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పడవలో ఆగ్రామానికి వెళ్ళి ప్రజలను పరామర్శించగా తమ అవసరాలను గురించి వారు వివరించగా బగ్గేరుపై వంతెన గ్రామాన్ని ఆత్మకూరు మండలంలో చేర్పించడం తదితరాల గురించి హామీ ఇచ్చారు. అయితే ఆయన గత ఫిబ్రవరిలో గుండెపోటుకు గురై హఠాన్మరణం పొందారు. మరి దివంగత గౌతంరెడ్డి స్థానంలో వారసుడుగా వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

# ట్రాఫిక్ అంతరాయంపై అధికారుల దృష్టి: ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ఆత్మకూరు,మేజర్‌న్యూస్: ఆత్మకూరు పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్‌వద్ద తరచూ ట్రాఫిక్ స్థంభిస్తుండడం, వాహనకారులు, ప్రయాణీకులు ఇబ్బందిపడుతుండడం దృష్ట్యా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆత్మకూరు ప్రధానరహదారి కావడం, సోమశిలరోడ్డు సెంటర్ నుండి అటు అనంతసాగరం, సోమశిల, మహిమలూరు, అప్పారావుపాళెం ,చేజర్ల మార్గాల్లో బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇదే మార్గంలో సోమశిల ప్రాజెక్టువద్దకు , అప్పారావుపాళెం ఇసుకరీచ్‌వద్దకు భారీ వాహనాలు కూడా వెళుతుంటాయి. అక్కడ దుకాణాదారులు ముందుకు మెట్లు నిర్మించుకోవడం, తమ వస్తువులను అక్కడ ఉంచడం, బస్‌షెల్టరు



లేనందున ప్రయాణీకులు కూడా ఆ దుకాణాల ముందు వేచి ఉండాల్సి రావడంతో నిత్యం రద్దీగా ఉండడం, తరచూ ట్రాఫిక్ స్థంభించడం జరుగుతుందని పదేపదే 'సూర్య' ప్రచురిస్తుండడం తెల్సిందే. సోమశిల రోడ్డు కూడలివద్ద తరచూ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్న విషయమై స్థానిక డిఎస్‌పి ఎన్.కోటారెడ్డి, మున్సిపల్ కమీషనర్ బి.నాగేశ్వరరావు, ఎస్ఐ ఎం. శివశంకరరావులు నాలుగైదు రోజుల క్రితం పరిశీలించారు. దుకాణాదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు చర్యలకు శ్రీకారం చుట్టారు. సోమశిల రోడుప్డ మార్గంలో, కూడలివద్ద దుకాణాల ముంగిట మెట్లు, ఇతర ఆక్రమణలను జెసిబితో తొలగింపజేశారు. రోడ్డుకిరువైపులా చదును చేయించారు. దాంతో రోడ్డు విశాలంగా మారింది. ట్రాఫిక్ అవస్థలు తొలగిపోయేలా చర్యలు తీసుకున్నారు. టిపివో ఎస్.చంద్రశేఖర్, మున్సిపల్ ఏయి జూపల్లి ప్రసాద్ తదితరులు పాల్గన్నారు.

# క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు, మేజర్‌న్యూస్: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ రెడ్ క్రాస్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణ అధికారులకు సూచించారు. నెల్లూరులో వున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ ఎం.హరినారాయణన్ శుక్రవారం సందర్శించారు. మొదటిసారిగా ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్‌కు సర్జికల్ అంకాలజిస్ట్ నాగేశ్వరరావు, సీనియర్ రేడియేషన్ తెరపిస్ట్ గీతా ఉషశ్రీ, వైస్ చైర్మన్ సుధీర్ నాయుడు, మేనేజర్ జుబేర్ తదితరులు కలెక్టర్ కు స్వాగతం పలికారు. పరిపాలన విభాగం, రేడియాలజీ విభాగం, రేడియేషన్ ఎక్విప్మెంట్, ఒపి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఏ విధమైన సేవలు రోగులకు అందిస్తున్నది డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దూర ప్రాంతాల నుండి పేద ప్రజలు క్యాన్సర్ వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారని వారందరినీ మంచి వైద్య సేవలందించి రెడ్ క్రాస్ కు మంచి పేరు తేవాలని కలెక్టర్ కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి 2001లో క్యాన్సర్ గుర్తించే సెంటర్ గా ప్రారంభమైందని, ప్రస్తుతం నెల్లూరు కడప తిరుపతి ప్రకాశం జిల్లాలో పేషెంట్లకు కాన్సర్ వైద్యం ,సర్జరీలు చేస్తున్నామని క్యాన్సర్ ను గుర్తించే ఆధునిక మిషనరీ ఏర్పాటుచేసి వైద్యం అందిస్తున్నామనీ,.ముఖ్యంగా 90 శాతం మంది పేదలకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్యం, అందిస్తున్నామన్నారు. నెలకు 70 నుండి 80 సర్జరీలు,500 నుండి600 వరకు కీమోలు,50 నుండి60 వరకు రేడియో తెరఫీలు రోగులకు అందిస్తున్నామన్నారు .ఇద్దరు. సర్జికల్ అంకాలజిస్టులు, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్ సీనియర్ రేడియాలజిస్ట్, 14 మంది జూనియర్ డాక్టర్లు సేవలందిస్తున్నారని డాక్టర్ నాగేశ్వరరావు కలెక్టర్ కు వివరించారు.నెలకు ఆసుపత్రి నిర్వహణకు 1కోటి25 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. కొంతమంది డోనర్లు ఆసుపత్రి నిర్మాణానికి సహకారం అందిస్తున్నారని అన్నారు . అడ్వైజర్, చైర్మన్ ల విలువైన సలహాలతో ఆసుపత్రిని సక్రమంగా నిర్వహిస్తున్నామని డాక్టర్ లు కలెక్టర్ కు వివరించారు.



### రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకును సందర్శించిన కలెక్టర్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడపబడుతున్న బ్లడ్ బ్యాంకును జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ శుక్రవారం సందర్శించారు. రక్తం సేకరణ నుండి వాటిని భద్రపరిచే తీరును తిరిగి పేదలకు అందించే పద్ధతిని డాక్టర్ యసోవర్ధన్ కలెక్టర్‌కు వివరించారు. నెల్లూరు బ్లడ్ బ్యాంక్ రాష్ట్రంలో మొదటి స్థానంలోనూ, దేశంలో రెండో స్థానంలోనూ ఉందని, బయట ప్రాంతాల్లో 1550 రూపాయలకు బ్లడ్ అందిస్తే నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ 1050 రూపాయలకే బ్లడ్ అందిస్తున్నామనీ, కలెక్టర్‌కు వివరించారు. మందబుద్ధి గల సుమారు వందమంది పిల్లలకు స్పీచ్ తెరపి, కంప్యూటర్ నేర్పిస్తున్నామని బ్లడ్ బ్యాంక్ డాక్టర్ అజయ్‌బాబు వివరించారు. సేకరించిన రక్తం ఆపదలో ఉన్న వారికి అందించి ప్రాణాలను నిలబెట్టాలని కలెక్టర్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వైస్ చైర్మన్ సుధీర్ నాయుడు మస్తానయ్య, కన్వీనర్ అజయ్ బాబు, సురేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరయ్య బెయిల్ మంజూరుకు దోహదపడ్డ ప్రముఖ క్రిమినల్ లాయర్ విప్పరపల్లి సాయిరాం



నాయుడుపేట, మేజర్‌న్యూస్: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రాజీవ్ నగర్‌లో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ప్లాట్లను అక్రమంగా అమ్ముకున్నారన్న ఆరోపణ కేసులో నిందితుడు యస్.అల్లూరయ్య గురువారం బెయిల్ పై విడుదల అయ్యాడు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమ్‌సాగర్, డిఫెన్స్ లాయర్ విప్పరపల్లి సాయిరాం వాదోపవాదాలను పరిశీలించిన మీదట న్యాయమూర్తి కృష్ణప్రియ డిఫెన్స్ న్యాయవాది వాదనతో ఏకీభవించి అల్లూరయ్యకు బెయిల్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా అల్లూరయ్య మాట్లాడుతూ పేదల కొరకు వాదించే మంచి మనసున్న న్యాయవాది విప్పరపల్లి సాయిరాం లాంటి లాయర్లు ఉన్నంతవరకు న్యాయం దేవత జీవించి ఉంటుందని ఆయన అభిప్రాయ పడ్డారు. అలాగే శ్రీ కాళహస్తి పట్టణంలో పేద ప్రజలకు ఏ సమయంలోనైనా నా కుటుంబం అండగా ఉంటుందని ఒక కమిట్మెంట్‌తో న్యాయం కోసం సమస్యను తన భుజాలపై వేసు కొని మోస్తూ ఎందరో జీవితాలలో వెలుగును నింపే సాయిరాం లాంటి మహాను భావులు చల్లగా ఉండాలని ఆయన విలేకరులకు తెలియ జేశారు. ఒక కాళహస్తి కాదు నాయుడుపేట. తిరుపతి. ప్రాంత ప్రజలు మా లాయర్ సాయిరాంను కలిసి తమ సమస్య లకు పరిష్కారం పొందగలరని ఆయన ప్రజలను కోరారు.

# మెడికవర్ హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాలు, వైద్యనిపుణులు

## 51 ఏళ్ల హజరత్తయ్యకు ఎమర్జెన్సీ వైద్యం అందించి ప్రాణాలు కాపాడాం: డాక్టర్ వైష్ణవి

నెల్లూరు, మేజర్‌న్యూస్: రక్త ప్రసరణ ఆగిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిన హజరత్తయ్యకు వైద్యచికిత్సలు అందించి అతనిని ప్రాణాపాయస్థితికి వెళ్లకుండా ఆరోగ్యవంతుడిగా చేయగలిగామని మెడికవర్ హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వైష్ణవి తెలిపారు. ఇటీవల తమ ఆసుపత్రికి 51 సంవత్సరాల హజరత్తయ్య అనే వ్యక్తి చాతిలో నొప్పితో బాధపడుతూ శ్వాస ఆడక పోవడం వంటి లక్షణాలతో మెడికవర్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ విభాగానికి రావడం జరిగిందన్నారు. వెంటనే ఎమర్జెన్సీలో ఉన్న వైద్య సిబ్బంది అతనికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి బిపి చూసి అనంతరం ఈసీజీ చేయడం జరిగింది. హజరత్తయ్యను పరీక్షించగా బీపీ తక్కువగా ఉండడం, అతను గుండె నొప్పితో బాధపడుతున్నట్లు తెలుసుకోగలిగారు. ఒకవైపు ఎమర్జెన్సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడే అతనికి కుడికాలు, చెయ్యి, మూతి వంకర పోవడం, మాట స్పష్టంగా రాకపోవడం వంటివి వచ్చి పక్షవాత లక్షణాలు కనిపించాయన్నారు.



అతన్ని వెంటనే వైద్య సిబ్బంది ఎమర్జెన్సీ సిటీ స్కాన్ విభాగానికి తరలించి పరిశీలించడంతో అతని కి రక్త ప్రసరణ సరిగా జరగడం లేదని గుర్తించామన్నారు. ఇది జరిగేలోపే గుండెపోటు కూడా రావడం జరిగింది. వెంటనే డాక్టర్ చైతన్య తన బృందం హజరత్తయ్యకు ఫైవ్ (5)సైకిల్స్ సిపిఆర్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్లో పేషెంట్ వచ్చిన 10 నుంచి 15 నిమిషాల లోపల సిటీ స్కాన్ చేయడం , సరైన సమయంలో గుండెకి సంబంధిం చిన వైద్యం, నరాలకు సంబంధిం చిన వైద్యం రెండు చేసి పేషెంట్ ప్రాణాలు కాపాడగలిగామని తెలియజేశారు. ఈ సమావేశంలో మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ నాగిరెడ్డి మాట్లాడుతూ పేషంటు అపస్మారక స్థితికి వెళ్లిన మూడు, నాలుగు గంటల లోపల ఆసుపత్రికి తీసుకు రాగలిగితే వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని తెలిపారు. అందుకు పేషెంట్ హజ రత్తయ్య ప్రత్యక్ష సాక్షి అన్నారు. అంతేకాక తమ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది ఉండటమే రోగికి మెరుగైన వైద్య సేవలు అందించ గలిగామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ డైరెక్టర్ ఆపరేషన్స్, ఇండియా మెఘా చిత్కర, వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దర్గా ప్రాంగణంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపి ఆదాల

నెల్లూరు, మేజర్‌న్యూస్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని దర్గామిట్ట బారాషాహిద్ దర్గా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 35వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లోని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి కేటాయించిన నిధులు రూ.15 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రూ.7.50 కోట్ల సంబంధించి దర్గా ప్రాంగణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మత సామరస్యానికి చిహ్నంగా ప్రాముఖ్యత కలిగిన బారాషాహిద్ దర్గా అభివృద్ధి లో రాజీపడే ప్రసక్తే లేదని, అభివృద్ధి కార్యక్రమాలన్నీ అనుకున్న సమయానికే అత్యంత నాణ్యవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి, ఇన్చార్జి ఏకశిరి శరత్ చంద్ర, డివిజన్ వైఎస్ఆర్సిపి నాయకులు పవన్, రంజిత్ కృష్ణ, శ్రీనివాసులు, కాసిం భాయ్, రాఘవయ్య, పలువురు కార్పొరేటర్లు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



నెల్లూరు, మేజర్ న్యూస్: నెల్లూరు రూరల్ నియోజక వర్గం లోని 18వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. శుక్రవారం 18వ డివిజన్లోని హరినాధపురం మూడో వీధి దర్గావీధి వద్ద నుండి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ నేరుగా ప్రజలకు చేరడం మంచి పరిణామ అని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 వ డివిజన్ కార్పొరేటర్ టి అశోక్ కుమార్, వంశి, శివసునీల్ రెడ్డి, తదితరుల తోపాటు స్థానిక డివిజన్ వైఎస్ఆర్సిపి నాయకులు మారం రెడ్డి కుమార్, తెనక రామకృష్ణారెడ్డి, ఎద్దల వెంకటరెడ్డి, సిరాజ్ బాషా, అమీర్ భాషా, కరిముల్లా, ఎస్ కే అమానుల్లా, రియాజ్ భాషా, భాను ప్రకాష్ రెడ్డి, సాయికృష్ణ, ఖాదర్ భాషా, జల్లి అంకయ్య, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

అనంతసాగరం, మేజర్‌న్యూస్: ప్రజా సమస్యల పరిష్కారమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని, అందుకు కృషి చేస్తానని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అనంతసాగరం మండలంలోని కామిరెడ్డి పాడు, మంగుపల్లి గ్రామాలలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. నాయకులు గ్రామస్తులు ఎమ్మెల్యేకు తిలకం దిద్ది, బాణాసంచా నడుమ ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, గ్రామంలో అంతర్గత రహదారులు నిర్మించాలని, కాలం చెల్లిన మంచినీటి వ్యవస్థ స్థానంలో నూతన పైపులైన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ముంగుపల్లి గ్రామంలో జగనన్న లేఔట్ల విషయంలో ప్రస్తుతం కేటాయించిన ప్రాంతం నివాస యోగ్యం కాదని ఆయన దృష్టి తెచ్చారు. ఆ సమస్యలపై సంబంధించిన శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వాటిపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి, సీనియర్ నాయకులు బిజి వేముల ఓబుల్ రెడ్డి,పేయ్యల ఈశ్వరయ్య, అధికారులు పాల్గొన్నారు.

